బుచ్చిబాపన్నపాలెం అభివృద్ధి ఇలా...

వైఎస్సార్ సీపీ పాలనలో బుచ్చిబాపన్నపాలెం అభివృద్ధి దిశగా పరుగులుదీసింది. గతంలో ఎక్కడ వేసి వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉండే ఈ గ్రామంలో నేడు ఎక్కడ చూసినా అభివృద్ధి ఫలాలు కనిపిస్తున్నాయి. తన సొంతగ్రామం కావడం వల్ల ఇక్కడి అభివృద్ధిపై శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపారు. మతాలు, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు ఇక్కడి వారందరికీ అందడం, గ్రామం అభివృద్ధి దిశగా పరుగులు పెట్టడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

- జగనన్న హయాంలోనే గ్రామాభివృద్ధి
- రూ.24 కోట్లతో అభివృద్ధి సంక్షేమం
- అర్హులందరికీ నవరత్నాలు

రొంపిచర్ల: మండలంలోని బుచ్చిబాపన్నపాలెం అభివృద్ధి దిశగా పరుగులు దీస్తోంది.జగనన్న పాలనలో తమకు మౌలిక వసతులు సమకూరాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి అవసరమైన మౌలిక వసతులను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సారథ్యంలో ఏర్పాటు చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, తన తండ్రి రాజశేఖర్‌రెడ్డిల హయాంలోనే తమ గ్రామానికి ఎక్కువ మేలు జరిగిందని వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో అర్హత గల పేదలందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తూ అదే స్థాయిలో గ్రామంలో అభివృద్ధి పనులు కూడా పూర్తయ్యాయి.

ఎమ్మెల్యే స్వగ్రామం కూడా ఇదే...

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి స్వగ్రామమైన బుచ్చిబాపన్నపాలెం గ్రామంలో రూ.24.22,65,545 రూపాయలతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. పంచాయతీలో రూ.10,69,46,000 రూపాయల మేర అభివృద్ధి చేశారని, ఆ ఘనత ఆయనికే చెందుతుందని గ్రామస్తులు తెలుపుతున్నారు. గ్రామస్తులకు రూ.13,53,19,545 రూపాయలు సంక్షేమ పథకాలు అమలయ్యాయి. గ్రామ అభివృద్ధిలో ఆయన శక్తి వంచన లేకుండా పని చేస్తూ గ్రామస్తులు సహకారంతో ముందుకు వెళ్తున్నారు. సంక్షేమ పథకాలు కూడా రాజకీయ పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ అందిస్తూ డాక్టర్ గోపిరెడ్డి తనదైన శైలీలో ముందుకు సాగుతున్నారు.



గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు..

1. రూ.82.60 లక్షలతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు
2. రూ.40 లక్షలతో నాడు-నేడులో పాఠశాల అభివృద్ధి
3. రూ.1.40 కోట్లతో సీసీ రోడ్లు
4. రూ.50 లక్షలతో డ్రెయిన్స్
5. రూ. 25 లక్షలతో గ్రావెల్ రోడ్లు
6. రూ. 2 లక్షలతో మసీదు కాంపౌడ్ వాల్
7. రూ.20 లక్షలతో మంచినీటి చెరువు అభివృద్ధి పనులు
8. రూ.40 లక్షలతో రైతులకు ఎంపీఎఫ్‌సీ గోదాం నిర్మాణం
9. రూ.2 కోట్ల రూపాయలతో విద్యుత్ సబ్ స్టేషన్
10. రూ.2,78,60,000లతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి పనుల నిర్వహణ.
11. టీటీడీ నిధులతో పాటు ఎమ్మెల్యే సొంత నిధులు జోడించి రూ.1.50 కోట్లతో ఆలయం, కల్యాణ మండపం పనులు కొనసాగుతున్నాయి.


వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్

12. మరో రూ.20 లక్షలతో గ్రామంలో గడపగడపకుమనప్రభుత్వంపనులు కొనసాగుతున్నాయి.
13. రూ.7 లక్షలతో వైఎస్సార్- ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం క్రింద ఇళ్ల నిర్మాణం పనులు
14. 820 కుటుంబాలకు సంక్షేమ కార్యక్రమాలు
15. వైఎస్సార్ పెన్షన్ కానుకకు 410 మందికి రూ.5,54,40,000
16. 420 మంది రైతులకు రైతు భరోసాతో రూ.2,26,80,000
17. రూ.1.45 కోట్లతో 245 మందికి ఇంటి స్థలాలు
18. 180 మందికి రూ.85,11,565 రూపాయలతో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ సేవలు
19. సున్నా వడ్డీ, పంటల భీమా, సబ్సిడీపై విత్తనాలు, అమ్మఒడి, జగనన్నా విద్యాదీవెన, వసతి దీవెన, చేయూత, ఈబీసీ నేస్తం, వాహన మిత్ర, వైఎస్సార్ ఆసరా, చేదోడు, వైఎస్సార్ బీమా, వైఎస్సార్ కల్యాణమస్తు, రైస్ కార్డులు లాంటి పథకాలు అమలు అవుతున్నాయి.


పూర్తయిన సచివాలయ నిర్మాణం


ఏర్పాటైన రైతు భరోసా కేంద్రం


సీసీ రహదారుల నిర్మాణం ఇలా..

మౌలిక వసతులు ఒనగూరాయి



ముఖ్యమంత్రి జగనన్న, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సారథ్యంలో మా గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు ఒనగూరాయి. వైఎస్సార్ సీపీ పాలనలో మా గ్రామంలో సంక్షేమం, అభివృద్ధి పథకాలను అమలు అయ్యాయి. ఇప్పటి వరకు మా గ్రామానికి ఏ ప్రభుత్వం లోనూ ఇన్ని వసరులు, సంక్షేమ పథకాలు ఒనకూరలేదు. డాక్టర్ గోపిరెడ్డికి గ్రామ ప్రజలు రుణపడి ఉంటారు.

–జయభారత్‌రెడ్డి, బుచ్చిబాపన్నపాలెం

అందరికీ సంక్షేమ ఫలాలు



గ్రామంలో సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందించాం. రాజకీయాలకు, కుల మతాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందాయి. ఎన్నడూ లేని విధంగా రూ.10 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేశాం. జగనన్న ప్రభుత్వంలో డాక్టర్ గోపిరెడ్డి సారథ్యంలోనే మా గ్రామం అభివృద్ధి సాధ్యమైంది.

–ఓర్సు జయమ్మ, సర్పంచ్, బుచ్చిబాపన్నపాలెం.

క్లుప్తంగా


నూతన ఓటు హక్కు కోసం దరఖాస్తులు స్వీకరణ

శావల్యాపురం: 18 సంవత్సరాలు నిండిన వారందరు నూతన ఓటు హక్కుకు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దారు నక్కా లక్ష్మి లావణ్య తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు ఏప్రిల్ 17 వరకు అర్జీలు తీసుకుంటామన్నారు. అర్హత ఉన్న వారందరూ సమగ్ర ఆధారాలతో సంబంధిత బీఎల్‌వోలు అర్జీ చేసుకుంటే క్షేత్రస్థాయిలో విచారణ చేసి అర్హత కల్గియున్న వారందరికీ ఓటు హక్కు కల్పిస్తామన్నారు. ఎన్నికల కమిషనర్ నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ తహసీల్దారు పేరిసోముల నాసరయ్య వీఆర్వోలు బీఎల్‌వోలు పాల్గొన్నారు.

శానంపూడిలో ఉచిత వైద్య శిబిరం

శావల్యాపురం: మండలంలోని శానంపూడి గ్రామంలో వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది సారథ్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు సూపర్‌వైజరు అలవలపాటి ఏడుకొండలు మంగళవారం తెలిపారు. గ్రామంలో జ్వరాలు ఉన్నాయని గ్రామస్తుల సమాచారం మేరకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందజేశారు. ఇంటింటికి తిరిగి జ్వర పీడితులను గుర్తించి వైద్య సేవలకు చర్యలు చేపట్టారు. మురుగుకాల్వల్లో దోమల నివారణ మందును పిచికారి చేశారు. ఈశిబిరంలో ఆరోగ్య కార్యకర్తలు బాజీ, శ్రీలలితా, సునీత, పావణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు బెహరావారిపాలెంలో ఆలయ ప్రారంభోత్సవం



రొంపిచర్ల: మండలంలో బెహరావారి పాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండరామ స్వామి వారి ఆలయ విగ్రహ ప్రతిష్ట ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. ఇప్పటికే శిల, ధ్వజ ప్రతిష్టంబనకు అవసరమైన యాగ, పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. బుధవారం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నూతన ఆలయ ప్రారంభోత్సవంతో పాటు స్వామి వారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం జరుగుతుందని వారు తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

గోగులపాడులో ఘనంగా తిరునాళ్ల



రొంపిచర్ల: మండలంలో గోగులపాడు గ్రామంలో వేంచేసియున్న సువర్చలా సమేత అభయాంజనేయ స్వామి ఆలయ 30వ వార్షికోత్సవ తిరునాళ్ల వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అదే విధంగా స్వామి వారిని ప్రత్యేకంగా, అలంకరించి విశేష, సహస్రనామ, పూజలు, అలంకరణ పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ఆవరణలో పొంగళ్లు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో రాత్రివేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయటం జరిగింది.

ముమ్మరంగా కందులు కొనుగోలు

శావల్యాపురం: మండలంలోని అన్నీ రైతుభరోసా కేంద్రంలో కందుల కొనుగోలు ముమ్మరంగా చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి పల్లపోతుల ప్రవీణ్ తెలిపారు. మంగళవారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఏవో మాట్లాడుతూ మండలంలో అన్నీ గ్రామాల్లో ఖరీఫ్ సీజనులో 1409 ఎకరాలు రైతులు సాగు చేయగా ఒక్కో ఎకరానికి 5 నుంచి 6 క్వింటాల వరకు దిగుబడులు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు 110 మెట్రిక్ టన్నులు కందులు కొనుగోలు చేశామన్నారు. నాఫెడ్ క్వింటా మద్దతు ధర రూ.9642 రూపాయలు కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులకు సంబంధించి గోనె సంచులు,కూలీ రవాణా చార్జీలు క్వింటాకు రూ. 74 రూపాయాలకు ప్రభుత్వం భరిస్తుందన్నారు. మార్కెటింగ్ ప్రమాణాలు మేరకు కొనుగోలు పారదర్శకంగా చేస్తున్నట్లు చెప్పారు. కందులు అమ్మిన రైతులకు నాలుగు రోజుల వ్యవధిలో నగదు ప్రభుత్వం జమ చేస్తుందన్నారు.

ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలి

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ బీవీ రమణరావు, ఎంపీడీఓ వీఏ విజయ కుమార్‌లు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల దృష్టా పంచాయతీ కార్యదర్శులకు దిశ నిర్దేశం చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. కోడ్ అమలులో ఉన్నప్పుడు చేపట్టాల్సిన చర్యలు గురించి వివరించారు.

రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు, తొలగించాలని, విగ్రహాలకు ముసుగులు వేయాలని ఆదేశించారు. కోడ్ ఉల్లంఘన లేకుండా పంచాయతీల్లో ప్రతి రోజు ఆయా సిబ్బంది ఒక గంట సమయం కేటాయించాలని తెలిపారు. ప్రభుత్వకార్యాలయాల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న ఫొటోలపై కోడ్ నియమ నిబంధనలు పాటించి ముసుగు ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. మండలంలో 33 పంచాయతీలకు 20 మంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నందున, ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మిగిలిన పంచాయతీలకు ఇన్‌చార్జిల బాధ్యతలు అప్పగించామని ఎంపీడీఓ తెలిపారు. సమావేశంలో ఇఓపీఆర్ ఆర్డీ ఎస్ కె జిలానీ బాషా, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


నాదెండ్లలో మాట్లాడుతున్న ఏఈఆర్‌వో, తహసీల్దార్ వరకుమార్

కోడ్ మేరకు నడుచుకోండి

నాదెండ్ల: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం అందరూ విధిగా నడుచుకోవాలని తహసీల్దార్, ఏఈఆర్‌వో డీవీబీ వర కుమార్ చెప్పారు. నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సెక్టార్ ఆఫీసర్లు, ఎంసీసీ టీంలు, ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వే స్టాటికల్, వీఎస్‌టీ, వీవీటీ, హోం ఓటింగ్, సెక్టార్ పోలీస్ ఆఫీసర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేలో జరిగే సాధారణ ఎన్నికలకు ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించి పోలింగ్ శాతం పెంచేలా పనిచేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వికలాంగులు, 85 ఏళ్ల పైబడిన వయోవృద్ధులకు హోం ఓటింగ్ నూరు శాతం జరిగేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఏ ఒక్క ఓటరునూ వదిలివేయకుండా ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా రాజకీయ పార్టీల జెండాలు, పోస్టర్‌లు, శిలాఫలకాలు, విగ్రహాలు కనిపించకుండా ఎన్నికల నియమావళి మేరకు వ్యవహరించాలన్నారు. కోడ్ ఉల్లంఘనపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల రోజుల అన్ని విద్యాసంస్థలు, పారిశ్రామిక కేంద్రాలకు సెలవు దినమైనందున ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలన్నారు. ప్రతి కేంద్రంలో వీడియో గ్రాఫర్‌తో సహా ఐదుగురు పోలీస్ సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యతేజ, ఎంఈవో కృష్ణారెడ్డి, ఆర్‌ఐ రమీజా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అమల్లోకి ఎన్నికల నిబంధనావళి

నాదెండ్ల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినందున ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ సంకురాత్రిపాడు, ఎండుగుంపాలెం గ్రామాల్లో పర్యటించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బీఎల్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేసి కప్పారు. శిలాఫలకాలకు స్టిక్కర్లు అతికించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న రాజకీయ నాయకులు ఫొటోలు, జెండాలు, చిత్రపటాలను తొలగించారు. పోలింగ్ జరిగే వరకూ ఎన్నికల నిబంధనావళి అమల్లో ఉంటుందని, ఆ మేరకు అధికారులు, సిబ్బంది నడుచుకోవాలని ఆయన తెలిపారు.


నాదెండ్లలో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగువేసిన అధికారులు


బొల్లాపల్లిలో మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ

అన్నీ గ్రామాల్లో ఫెక్సీలు తొలగింపు

శావల్యాపురం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండలంలోని అన్నీ గ్రామాల్లో ఫెక్సీలు తొలగింపుతో పాటు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నట్లు ఎంపీడీవో కొత్రపాటి కవితా చౌదరి మంగళవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేలా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు.

ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో ఆయా పంచాయతీ కార్యదర్శి సారథ్యంలో అన్నీ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఫెక్సీల తొలగింపుతో పాటు ఎండీఎంయూ వాహనాలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిక్కర్లు కూడా కనిపించకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మండల ప్రజల సహకారంతో ఎన్నికల విజయవంతమయ్యేలా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే మనందరి లక్ష్యం


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి కావటి

చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు

యడ్లపాడు: మనదంతా ఒకే కుటుంబం.. మనందరి లక్ష్యం వైఎస్సార్‌సీపీకి అత్యధిక మెజార్టీతో మళ్లీ అధికారంలోకి వచ్చేలా చేయడమే అని చిలకలూరిపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు చెప్పారు. మంగళవారం రాత్రి యడ్లపాడు గ్రామంలో పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు కల్లూరి విజయ్‌కుమార్, అలాగే యడ్లపాడు సొసైటీ మాజీ చైర్మన్ కల్లూరి శ్రీనివాసరావు, కల్లూరి రామకృష్ణ కుటుంబాలను కలిసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మనోహర్ నాయుడు మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో చిలకలూరిపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేసిన విధంగా తాను మండలంలోని పార్టీ ముఖ్య నేతలను కలిసి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ ఆదేశాల మేరకు సమన్వయంతో సమష్టిగా మరోమారు అధికార పగ్గాల్ని వైఎస్సార్ సీపీ చేజిక్కించుకునేందుకు పాటుపడాలని అభ్యర్థించారు. నాయకులు, కార్యకర్తల సమస్యల్ని ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకువచ్చి సత్వరమే పరిష్కరించుకుని అంతా కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేసేందుకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఘంటా శంకర్, జేసీఎస్ కన్వీనర్ రాచమంటి చింతారావు, నాయకులు కర్నాట సుబ్బారావు, శేషిరెడ్డి, పందుల బుల్లెబ్బాయి, వి.శ్రీనివాస నాయక్, కారుచోల పున్నయ్య, వంకాయలపాడు సాయి తదితరులు ఉన్నారు.

ఓటరు నమోదుకు చివరి అవకాశం

- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతిఒక్కరు సహకరించాలి
- ఈఆర్‌ఓ వరదా సుబ్బారావు


మాట్లాడుతున్న వినుకొండ అసెంబ్లీ ఎన్నికల ప్రత్యేక అధికారి వరదా సుబ్బారావు

వినుకొండ టౌన్: ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు మే 13ను ఎన్నికల తేదీగా ఎన్నికల కమిషన్ ప్రకటించిన నేపథ్యంలో, 18 సంవత్సరాలు నిండి ఇప్పటి వరకు ఓటు నమోదు చేసుకోనటువంటి వారు ఏప్రిల్ 15లోపు నూతనంగా ఓట్లు నమోదు చేసుకోవచ్చునని పులిచింతల ప్రాజెక్ట్ డిప్యూటీ కలెక్టర్, వినుకొండ అసెంబ్లీ ఎన్నికల ప్రత్యేక అధికారి వరదా సుబ్బారావు తెలియచేశారు. వినుకొండ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎన్నికల ఏర్పాట్లపై విలేకరులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల తేదీ ప్రకటన వెలువడిన నాటి నుంచి కోడ్ ఆఫ్ కండెక్ట్ అమలులో ఉందన్నారు. నూతన ఓట్లు చేర్చుకునేందుకు మాత్రమే అవకాశం ఉందని, ఫారం 7, 8లను దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేదన్నారు. వ్యక్తులు ఎవరైనా 50 వేల రూపాయలకు మించి కలిగి ఉన్నా, ఆర్థిక లావాదేవీలు నిర్వహించినా, 10 వేల రూపాయల విలువకు మించి వస్తువులను కలిగి ఉన్నా సదరు అంశాలపై సరియైన పత్రాలతో వివరణ ఇవ్వవలసి ఉంటుందని, ఆధారాలు చూపని యెడల సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అధిక మొత్తంలో లావాదేవీలు నిర్వహించిన బ్యాంకు ఖాతాల వివరాలను సైతం ఆదాయ పన్ను శాఖకు తెలియచేయడం జరుగుతుందన్నారు. అమలులో ఉన్న పథకాలు (ఆరోగ్య సురక్ష, ఎన్ఆర్‌ఈజీఎస్ వంటి పలు పథకాలు) కొనసాగుతాయని, ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల ఖర్చుల వివరాలను పరిశీలించేందుకు ప్రత్యేక అధికారిని నియమించడం జరిగిందని, ప్రచార కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అనుమతులు తప్పనిసరి అని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అంతేకాకుండా ఎన్నికల సమయంలో ఫిర్యాదులు స్వీకరించేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేసి, 08646-272000 నెంబరును కేటాయించామని, ఎన్నికలు జరిగే తీరును ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు గమనిస్తాయన్నారు. ఫిర్యాదు అందుకున్న 100 నిముషములలో సమస్యను పరిష్కరిస్తామన్నారు.

అభ్యర్థులు నామినేషన్ల దాఖలుకు ఆన్‌లైన్ (సువిధ యాప్), ఆఫ్‌లైన్ విధానాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వి.ఎస్.టి టీంలు అభ్యర్థులు నిర్వహించే సభలు, సమావేశాలను పర్యవేక్షిస్తాయన్నారు. పట్టణంలోని నిర్మల ఉన్నత పాఠశాలను నియోజకవర్గ పరిధిలో జరిగే ఎన్నికల సామగ్రిని భద్రపరిచి, పంపిణీ చేసేందుకు కేటాయించామన్నారు. సమావేశంలో 5 మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, పట్టణ సీఐ సాంబశివరావు, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండవ రోజు 20 మంది గైర్హాజరు

పరీక్ష కేంద్రాల్ని తనిఖీ చేసిన ఇద్దరు జిల్లా అధికారులు

యడ్లపాడు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రెండో రోజున ప్రశాంతంగా జరిగాయి. మండలం పరిధిలోని మూడు పరీక్ష కేంద్రాలలో 583 మందికి గానూ రెండో రోజు పరీక్షలకు 563 మంది పరీక్షలు రాయగా 20 మంది గైర్హాజరయ్యారు. వీరిలో యడ్లపాడు జెడ్పీహైస్కూల్ పరీక్షా కేంద్రంలో 20 మంది, సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 2, నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఆరుగురు పరీక్షలకు హాజరుకాలేదు.

రెండు పరీక్ష కేంద్రాల తనిఖీలు

మండల కేంద్రమైన యడ్లపాడు సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని మంగళవారం పల్నాడు జిల్లా పరిశీలకులు గుంటూరు విద్యాశాఖ ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి, అలాగే స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌ను జిల్లాఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి బీఎం శర్మ సందర్శించి ఆకస్మిక తనిఖీలు చేశారు. సదుపాయాల కల్పన, పరీక్షల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

కోడ్ అమలులో ఉందనీ..



పురపాలక సంఘం పరిధిలో ఎన్నికల కోడ్ అమలును మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి మంగళవారం స్వయంగా పర్యవేక్షించారు. కొన్ని ప్రధాన రహదారులపై అభ్యంతరకరంగా ఉన్నటువంటి వాటిని సిబ్బందిచే తొలగించటం, వాటికి వస్త్రంచే కన్పించకుండా చేయటం, పెయింట్ వేయించటం చేశారు. అన్ని ప్రధాన రహదారులు, సచివాలయ పరిధిలో ఉన్నటువంటి అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన విగ్రహాలు, బ్యానర్లు, హోర్డింగ్స్, పోస్టర్లు, జెండాలు, రహదారి ఆర్చీలు అన్నిటిని గుర్తించి ఏర్పాటుచేసిన టీం సభ్యుల ద్వారా వాటిని కన్పించకుండా చేశారు. మున్సిపల్ ఇంజనీర్ బి.కనకారావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఎం.నరసింహారావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య పాల్గొన్నారు.

–నరసరావుపేట

ప్రశాంతంగా జరిగేందుకనీ...



రొంపిచర్లలో మంగళవారం పోలీసులు, సీఆర్‌పీఎఫ్ కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో అన్ని వీధులలో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. కవాతులో పాల్గొన్న ఎస్ఐ కె.పి.రవీంద్రబాబు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మండలంలో ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. దీని ప్రకారం ప్రతిరోజు రాత్రి 10 గంటల్లోపు అన్ని షాపులు మూసివేయాలన్నారు. రాత్రి 10 గంటల దాటిన తరువాత అనవసరంగా బయట తిరగరాదన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు తమకు సహకరించాలని కోరారు. గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులను, సీఆర్‌పీఎఫ్ కేంద్ర బలగాలను గ్రామస్తులు ఆసక్తికరంగా తిలకరించారు.

–రొంపిచర్ల

రెండు రోజులు తాగునీటి సరఫరా నిలుపుదల

నరసరావుపేట: రావిపాడు శాంతినగర్ నుంచి పట్టణానికి తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైనుకు ఏర్పడిన లీకులను అరికట్టేందుకు ఈనెల 21, 22 తేదీల్లో ఉదయం పూట తాగునీరు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం యధావిధిగా ఉంటుందని పేర్కొన్నారు.